


3న సావిత్రిబాయి పూలే విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కలెక్టరేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిభా పూలే విగ్రహం ప్రక్కన ఏర్పాటు చేస్తున్న సావిత్రిభాయి పూలే విగ్రహాన్ని జనవరి 3న ఆవిష్కరిస్తామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ప్రకటించారు. ఈప్రాంగణాన్ని సుమారు రూ.43.75 లక్షలతో ఆధునీకరించి, గ్రానైట్‌తో, రంగుల విద్యుత్ దీపాలతో, వాటర్ ఫౌంటెన్‌తో అందంగా తీర్చిదిద్దారు. ఈ సుందరీకరణ పనులను కోలగట్ల శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు విగ్రహావిష్కరణ చేయనున్నట్లు తెలిపారు. ఆ రోజు వైఎస్ఆర్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ప్రసాదరావు, ఎంఇ శ్రీనివాసరావు, తాహశీల్దార్ సిహెచ్ బంగార్రాజు, పలువురు కార్పొరేటర్లు, జోనల్ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

ఎన్ఇపి అమలుతో.. ప్రభుత్వ విద్యకు దూరం

పలు పాఠశాలలు మూత / 287 బడులు విలీనం

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా జాతీయ నూతన విద్యా విధానాన్ని వైసిపి ప్రభుత్వం అమలు చేయడంతో ఈ ఏడాది జిల్లాలో విద్యా వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. పలు పాఠశాలలు మూతపడడం, మరికొన్ని పాఠశాలలు దూరంలోగల పాఠశాలల్లో విలీనం కావడతో పేదలకు విద్య అందని ద్రాక్షలా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గి పరోక్షంగా ప్రయివేటు విద్యను ప్రోత్సహించింది. మరోవైపు ఉపాధ్యాయుల కృషితో టెన్త్, ఇంటర్‌తో పాటు ఎంసెట్, జెఇఇ మెయిన్స్, అడ్వాన్సులో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. మరోవైపు బైండోవర్ కేసులు, గృహ నిర్బంధాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



రేగిడి : పాఠశాల విలీనానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు (ఫైల్)



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ విద్యా విధానం అమలుతో జిల్లాలో విద్యావ్యవస్థ కుంటుపడింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు పేద విద్యార్థులకు శాపంలా మారాయి. జిల్లాలో 287 ప్రాథమిక పాఠశాలలు మూడు కిలోమీటర్ల దూరంలోగల ఉన్నత పాఠశాలల్లో విలీనం కావడంతో వందలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యారు. పాఠశాలల విలీనం కారణంగా సుమారు 10 వేల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలల్లో చేరారు. ఎన్ఇపి అమలులో భాగంగా బైజ్యూస్‌తో ఒప్పందం కుదుర్చుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది 9720 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది.

శాపంగా మారిన జీవో 117, 128

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117, 128 కారణంగా జిల్లాలో పేద విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేసింది. 23 యుపి పాఠశాలలు, 258 ప్రాథమిక పాఠశాలలు ఉన్నత పాఠశాల్లో విలీనమయ్యాయి. మరోవైపు జిల్లాలో 28 హైస్కూళ్లలో హెచ్ఎం, పీడీ పోస్టులు లేని దుస్థితి నెలకొంది. హేతుబద్ధీకరణ జీవో వల్ల జిల్లాలో సుమారుగా 1500 మందిని మిగులు ఉపాధ్యాయులుగా ప్రభుత్వం తేల్చింది.

మూతపడిన ఎయిడెడ్ విద్యా సంస్థలు

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 18ఎయిడెడ్ విద్యాసంస్థలు మూతపడ్డాయి,కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలుగా మారాయి. స్వాతంత్ర్యం అనంతరం లక్షలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించిన ఈ విద్యాసంస్థలను ప్రభుత్వం ఒక్క కలం పోటుతో మూసేసింది. దీంతో జిల్లాలో ఎయిడెడ్ విద్యా సంస్థలు అంకానికి 2022 సంవత్సరంతో తెరపడింది.

సిబిఎస్ఇ పేరుతో మాతృ భాషకు మంగళం

జాతీయ విద్యా విధానం పేరుతో మాతృ భాష కు రాష్ట్ర ప్రభుత్వం మంగళం పాడేందుకు రంగం సిద్ధం చేసింది. అందుకు అనుగుణంగా జిల్లాలో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి 120 స్కూళ్లలో అమలుకు జిల్లా విద్యా శాఖ సిద్ధమైంది. సిబిఎస్ఇ అమలు కావాలంటే తగిన విధంగా పాఠశాలల్లో ల్యాబ్, లైబ్రరీ, ప్రాజెక్ట్ వర్క్ కోసం కంప్యూటర్ ల్యాబ్ లు ఉండాలి, జిల్లాలోని ఏ పాఠశాలలోనూ అందుకు తగిన సౌకర్యాలు లేవు. అయినా బలవంతంగా సౌకర్యాలు లేకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

నిర్బంధాలు, అరెస్టులు

సిపిఎస్ రద్దు కోసం పెద్దఎత్తున ఉపాధ్యాయులు ఉద్యమించారు. ఈనేపథ్యంలో అరెస్టులు, నిర్బంధాలు నడుమ పాఠశాలల్లో బోధన చేయాల్సి వచ్చింది. జిల్లాలో 80 మంది ఉపాధ్యాయులపై బైండోవర్ కేసులు పెట్టారు. పాఠశాలలకు వెళ్లి అరెస్టు చేయడం, ఇళ్ల వద్ద నిర్బంధించడంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడ్డారు.

నాడు- నేడుతో మారిన రూపురేఖలు

జిల్లాలో మొదటి,రెండో విడత నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ విద్యా సంస్థలు రూపురేఖలు మారాయి. మొదటి విడతలో రూ.150 కోట్లు పైన, రెండో విడతలో రూ.200 కోట్లు పైన నిధులతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. ఎన్ఇపి అమలు, ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో వీటిలో కొన్ని పా ఠశాలలు మూతపడడంతో కోట్లాది రూపాయలు నిధులు వృథా అయ్యాయి.

మెరుగైన ఫలితాలు సాధన

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లా 77.50 శాతం ఉత్తీర్ణతతో 3వ స్థానం సాధించింది. కెజిబివి పాఠశాలల ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫలితాల్లో కాస్తా వెనుకబడింది. టెన్త్ ఫలితాల్లో రాష్ట్రంలో మూడో స్థానంలో నిలిచిన జిల్లా ఇంటర్ ఫలితాల్లో మాత్రం 12వ స్థానంలో నిలిచింది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బాలికలదే పైచేయి అయ్యింది. ఎంసెట్ ప్రవేశ ఫలితాల్లో 7, 10, 15 ర్యాంకులు సాధించారు. జెఇఇ మెయిన్స్, అడ్వాన్సుడ్ ఫలితాల్లో పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి దేశంలోనే పేరుగాంచిన ఐఐటిలు, ఎన్ఐటిల్లో సీట్లు పొందారు. ఇలా పలు పోటీ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించి విద్యల నగరం పేరును సార్థకత చేశారు.

సఖి ద్వారా బాలికల్లో చైతన్యం

- శతశాతం అక్షరాస్యతకు కృషి
- ఉపాధి పనుల్లో రాష్ట్రంలోనే ప్రథమం
- పింఛన్ల ఎంపికకు ఆరంచెల పద్ధతి
- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లాలో చేపట్టిన చిట్టిగురువులు కార్యక్రమం ద్వారా శత శాతం అక్షరాస్యత సాధించడం, సఖి బృందాలను ఏర్పాటు చేసి యువతులలో ధైర్యాన్ని నింపి వారికి భరోసా నివ్వడం సంతృప్తిని కలిగించాయని జిల్లా కలెక్టర్ సూర్య కుమారి తెలిపారు. కౌమార బాలికల విద్య, ఆరోగ్యం, ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా 3,272 బృందాలను 89 వేల మంది సభ్యులతో ఏర్పాటు చేయడం జిల్లాకే ప్రత్యేకమని అభిప్రాయపడ్డారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఏడాదిలో సాధించిన విజయాలు, ప్రాజెక్టుల పురోగతిపై వివరించారు. చిట్టి గురువులు కార్యక్రమం ద్వారా 8370 మంది నిరక్షరాస్యులను నమోదు చేయగా, 8004 మంది పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. నాడు-నేడు కార్యక్రమం కింద మొదటి దశలో 849, రెండవ దశ లో 739 పాఠశాలలను, 17కళాశాలలను అభివృద్ధి చేయడానికి పనులు చేపట్టగా 70 శాతం వరకు పూర్తయ్యాయని తెలిపారు. జమ్ము నారాయణపురం పాఠశాల జాతీయ స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాన్ని సాధించడం ఆనందంగా ఉందన్నారు. కెజిబివి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచామన్నారు. ఉపాధి హామీలో జిల్లాలో అత్యధిక పనులను చేపట్టి 304.3 కోట్ల రూపాయలు ఖర్చు చేసి రాష్ట్రంలోనే ప్రథమ స్థానం, 1.4 కోట్ల పని దినాలను కల్పించి రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జిల్లాలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం రెల్లిలో 158 ఎకరాలను కేటాయించినట్లు డయాగ్నొస్టిక్స్, మరో రూ.10కోట్ల తో రెండు రైస్ మిల్లుల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఎంఎస్ఎంఇ కింద మాంగో జెల్లీ, బెల్లం శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ, ప్లేస్ మెంట్ కింద 2500 మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ ఏడాది భోగాపురం ఎయిర్‌పోర్ట్, మెడికల్ కళాశాల, జాతీయ రహదారుల పనులు పురోగతి సాధించాయని, సిటియు, ఎయిర్‌పోర్టు శంకుస్థాపనలు త్వరలో జరుగుతాయని తెలిపారు. మెడికల్ కాలేజీలో వచ్చే జూన్‌కి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు.

పింఛన్ల ఎంపికకు ఆరు అంచెల పద్ధతి

జిల్లాలో కొత్తగా 10 వేల మందికి పించన్లను మంజూరు చేశామని, ఆరు అంచెల వెరిఫికేషన్ లో అనర్హులుగా గుర్తించిన 4800 మందికి నోటీసు లు జారీ చేశామని కలెక్టర్ తెలిపారు. విచారణ అనంతరం 50 శాతం వరకు అర్హత సాధించిన వారు ఉన్నారని, వారికీ పింఛన్లు అందజేస్తామని చెప్పారు. 2023లో ప్రజలందరికీ మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉండాలని, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నవ్య జ్యూట్‌మిల్లు కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇఎస్ఐ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని నియమించి , కార్మికులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరుతూ శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు ఆసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. పట్టణంలోని రామన్నదొరవలస వద్దగల నవ్య జ్యూట్ మిల్లులో జరిగిన ప్రమాదంలో మల్లమ్మపేటకు చెందిన కార్మికుడు కత్తుల మురళి చెయ్యి వేలు కట్ అయింది. వెంటనే మురళి తోటి కార్మికుల సహాయంతో ఇఎస్ఐ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ వైద్యులు అందుబాటులో లేరు. మందులు కూడా లేకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోవాలని ఇఎస్ఐ సిబ్బంది చెప్పడంతో గత్యంతరం లేక ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కార్మికులు ఆస్పత్రి వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ బొబ్బిలి ప్రాంతంలో సుమారు 2500 మంది కార్మికులు ప్రతినెలా ఇఎస్ఐకు డబ్బులు చెల్లిస్తున్నప్పటికీ వైద్యం అందించకపోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం స్పందించి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని, సంపూర్ణంగా మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవ్య జ్యూట్ మిల్లు కార్మికుల సంఘం అధ్యక్షులు చిరంజీవి, కార్మికులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆరా



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామ సచివాలయ సేవలపై మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆరాతీశారు. శుక్రవారం మండలంలోని కొప్పెర్ల సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఉద్యోగులు, వాలంటీర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయ వ్యవస్థ సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయం ద్వారా సంక్షేమ పథకాలు ప్రజలకు ఎలా చేరుతున్నాయో తెలుసుకున్నారు. వాలంటీర్ల పనితీరుపై ఆరాతీశారు. సచివాలయ వ్యవస్థపై తెలుసుకునేందుకు వచ్చానని ఆయన తెలిపారు. ఆయనతోపాటు వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, నాయకులు పుప్పాల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ప్రమాదం ముంగిట్లో ఎరుకలపాకలు

- విద్యుత్తు శాఖాధికారుల కక్ష సాధింపు
- గ్రామంలో వరుస ప్రమాదాలు
- ఆందోళనలో గిరిజనం



ఫ్యూజ్ లేకుండా గ్రామానికి నేరుగా కరెంటు సరఫరా అయ్యేలా కలిపేసిన తీగలు

ఎరుకుల సామాజిక తరగతి.. అంటే, జిల్లాలో టక్కున గుర్తొచ్చేది బాడంగి మండలం గజరాయనివలస పంచాయతీ పరిధిలోని ఎరుకల పాకలు గ్రామమే. అభివృద్ధికి దూరమైనా, పాలకులు పట్టించుకోకున్నా వెదురుతో బుట్టలు, వస్తువులు తయారు చేస్తూ దుర్భర జీవనం సాగిస్తున్నారు ఆ గ్రామస్తులు. అలాంటి గిరిజనం ప్రమాదం ముంగిట్లో ఉన్నారు. విద్యుత్తు శాఖాధికారుల వేధింపులు, కక్ష సాధింపు చర్యలతో భయం భయంగా బతుకీడుస్తున్నారు. ఎప్పుడు ఏ ముప్ప ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇంతకీ ఏం జరిగిందంటే..?

ప్రజాశక్తి- బాడంగి

ఈ నెల 27న ఎరుకలపాకలు గ్రామానికి విద్యుత్తు శాఖ ఎఇ, సిబ్బంది స్థానికంగా నివాసముంటున్న గజరాయనివలస ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరు ఇంటికి వెళ్లి.. 'మీ ఇంటికి కరెంటు సరఫరా నిలిచిపోయిందని హైకోర్టుకు వెళ్లారు కదా! ఆ మీటరు ఎక్కడుందో చూపించండి' అని అడిగారు. అక్కడి నుంచి గ్రామానికి విద్యుత్తు సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు సిబ్బంది చేరుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ నుంచి గ్రామానికి విద్యుత్తు సరఫరా అయ్యే వైరును ఫ్యూజును తొలగించి, డైరెక్టుగా కలిపేశారు. గ్రామంలో ఏదైనా విద్యుత్తు ప్రమాదం సంభవిస్తే అంతే సంగతి. విద్యుత్తు సరఫరా ఆపేందుకు అవకాశం లేకుండా చేశారు. దీనివల్ల గ్రామంలో మోటార్ల వద్ద ఎర్త్ కావడంతో ఒక మోటార్ కాలిపోయింది. ట్రాక్టరు రాకపోకలు సాగించే సమయంలో ఓ ఇంటి సర్వీసు వైరు తెగింది. అది బాగుచేయడానికి వెళ్లిన హెల్పర్.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మెయిన్ వైర్ డైరెక్ట్ చేయడంతో ఏమీ చేయలేక చేతులెత్తేశారు. ఫలితంగా ఆ కుటుంబం అంధకారంలో మగ్గుతోంది. విద్యుత్తు తీగలపై కొబ్బరిమట్ట పడటంతో మంటలు చెలరేగడంతో గ్రామస్తులు భయంతో పరుగులు తీశారు. కానీ గ్రామస్తులు ఏమీ చేయలేని నిస్సహాయత. ఎందుకంటే వారంతా అమాయక గిరిజనం. అందుకే అంతలా విద్యుత్తు శాఖ సిబ్బంది బరితెగించారు. మొత్తం గిరిజనులందరినీ ప్రమాదం ముంగిట్లోకి నెట్టారు.

ఇలా మొదలైంది

ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎంపిటిసి సభ్యులు పాలవలస గౌరుతోపాటు గ్రామస్తులు మతం మారాలని నాలుగు నెలల క్రితం బొబ్బిలిలో విద్యుత్తు శాఖలో పనిచేస్తున్న జూనియర్ అకౌంట్ ఆఫీసర్ అడిగితే, వారు అంగీకరించలేదు. అనంతరం కక్ష సాధింపుగా విద్యుత్తు బిల్లు బకాయి ఉందని సాకుగా చూపించి, ముందస్తు నోటీసు, సమాచారం లేకుండానే అక్టోబరు 15న గౌరు ఇంటికి కరెంటు కట్ చేశారు. 2016లో పాలవలస చినరాములు దగ్గర ఆ ఇంటిని గౌరు కొనుగోలు చేశారు. ఆ ఇంటికి ఉన్న విద్యుత్తు మీటర్‌నే వినియోగించారు. 2020 ఫిబ్రవరిలో విద్యుత్తు బిల్లు రూ.27 వేలు రావడంతో విద్యుత్తు శాఖ అధికారులకు ఆయన ఫిర్యాదు చేయగా మీటర్ స్టక్ అయిందని చెప్పారు. పాత మీటరు తీసేసి కొత్తది పెట్టారు. అనంతరం ఎస్‌టిలకు విద్యుత్తు సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వడంతో విద్యుత్తు బిల్లు పూర్తిగా రావడం లేదు. ఇటీవల కాలంలో విజయనగరం నుంచి బదిలీపై వచ్చిన ఉద్యోగి విద్యుత్తు కనెక్షన్ కట్ చేశారు. కోళ్లఫారానికి వెళ్లే విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో కోళ్లన్నీ మరణించాయి. గ్రామంలో ఇప్పటికీ 4 కుటుంబాలకు కరెంటు సరఫరా లేదు. ఇదే విషయంపై పాలవలస గౌరు... హైకోర్టులో కేసు వేశారు. ఎస్‌సి కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. ఎస్‌పి స్పందనలోనూ వినతి అందించారు. దీంతో విద్యుత్తు శాఖాధికారులు కక్ష సాధింపు చర్యలకు, వేధింపులకు దిగుతున్నారని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని వాపోయారు.

మా మోటారు కాలిపోయింది



ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర డైరెక్ట్ చేయడం వల్ల మా ఇంటి మోటారు కాలిపోయింది. మా గ్రామస్తులపై విద్యుత్తు శాఖ అధికారులకు ఎందుకంత కక్ష?. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి.

- పాలవలస పైడిరాజు, ఎరుకలపాకలు గ్రామం

అంధకారంలో ఉంటున్నాం



మా వీధిలో నుంచి గడ్డి ట్రాక్టర్ వచ్చినప్పుడు మా సర్వీస్ వైర్ తెగిపోయింది. వెంటనే మా అబ్బాయి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కరెంటు సరఫరా ఆపడానికి వెళ్లాడు. గ్రామానికి నేరుగా సరఫరా కలిపేయడంతో ఆపేందుకు వీల్లేకుండా పోయింది. దీంతో భయాందోళనకు గురయ్యాం. తరువాత మరమ్మతులు చేసేందుకు అవకాశం లేదు. అంధకారంలో ఉంటున్నాం.


- గొర్రెల దుర్గమ్మ, ఎరుకలపాకలు గ్రామం

రాజకీయ దన్నుతోనే వేధింపులు



రాజకీయ నాయకుల అండతోనే విద్యుత్తు శాఖ అధికారులు కక్ష సాధింపులకు దిగుతున్నారు. చాలా చులకనగా, హేళనగా మాట్లాడుతున్నారు. అధికారుల వేధింపులతో మా గ్రామంలో కొన్ని కుటుంబాలు ఇప్పటికే వలసలు వెళ్లిపోయాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలి.

- పాలవలస గౌరు, ఎంపిటిసి, గజరాయనివలస



ఆర్ఎంకు వినతి అందిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

బస్టాండ్లలో మౌలిక వసతులు కల్పించాలి

ఆర్‌టిసి ఆర్ఎంకు డివైఎఫ్ఐ నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

జిల్లాలోని బస్‌స్టేషన్లలో మౌలిక వసతులు కల్పించాలని డివై ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ హరీష్, ఎన్. రుద్ర ప్రసాద్ కోరారు. శుక్రవారం ఆర్టీసి అర్ఎం పరమేశ్వరరావుకు వినతి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగ దగ్గరపడడంతో స్వగ్రామానికి పోయే వలస కూలీలు, ప్రయాణికుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో ఆర్‌టిసి బస్టాండ్లలో సౌకర్యాలు కల్పించాలని కోరారు. మరుగుదొడ్లను మరమ్మతులు చేయించి లేని దగ్గర ఏర్పాటు చేయాలని, ఆర్ఓ ప్లాంట్ ద్వారా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని, బాలింతలకు బేబీ ఫీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు సరిపడా కుర్చీలను ఏర్పాటు చేయాలని, సుదీర్ఘ ప్రాంతాలకు అవసరమైన బస్సు సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతినిచ్చిన వారిలో జిల్లా సహాయ కార్యదర్శి గణేష్, ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లవర్ బొకేలు తీసుకురావద్దు

విజయనగరం : నూతన సంవత్సరం సందర్భంగా తమకు శుభాకాంక్షలు చెప్పేటప్పుడు, ఫ్లవర్ బొకేలను తీసుకురావద్దని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి కోరారు. వాటికి బదులుగా విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు లాంటి సామగ్రిని మాత్రమే తీసుకురావాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదివారం ఉదయం 9 గంటలు నుంచి, కలెక్టర్ క్యాంపు ఆఫీసులో ప్రజలకు అందుబాటులో ఉంటారని డిఆర్ఓ ఎం.గణపతిరావు తెలిపారు.

క్రీడలతో ఒత్తిడి నుంచి ఉపశమనం



బ్యాటింగ్ చేస్తున్న జెడ్‌పి ఛైర్మన్ మజ్జి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని విజ్జి స్టేడియంలో విజయనగరం సివిల్ విభాగానికి చెందిన 'సివిల్ వారియర్స్, చింతలవలస బెటాలియన్‌కు చెందిన 'బెటాలియన్ రైఫిల్స్' మధ్య శుక్రవారం జరిగిన క్రికెట్ మ్యాచ్ రసవత్తరం గా సాగింది. నిరంతర విధులు, ఒత్తిడి నుండి ఉపశమనం పొందేందుకు ఎస్‌పి ఎం.దీపిక ఆధ్వర్యంలో సివిల్ విభాగానికి చెందిన పోలీసు అధికారులు సివిల్ వారియర్స్'గా, చింతలవలస బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో బెటాలియన్ పోలీసు అధికారులు 'బెటాలియన్ రైఫిల్స్' గా క్రికెట్ పోటీలో పాల్గొన్నారు. ముఖ్య అతిధులుగా రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరంతరం విధులను నిర్వహిస్తూ, ఎంతో ఒత్తిడికి గురయ్యే పోలీసులు, ఉపశమనం పొందేందుకు ఉత్సాహాన్ని, క్రీడా స్ఫూర్తిని నింపారన్నారు. టాస్ గెలిచి బ్యాటింగు ఎంచుకున్న సివిల్ వారియర్స్ 20 ఓవర్లలో 5 వికెట్లును కోల్పోయి 182 పరుగులు సాధించారు. 183 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగు ప్రారంభించిన బెటాలియన్ రైఫిల్స్ చివర బంతి వరకు పోరాడి, 3 వికెట్లుతో విజయం సాధించింది. విజేతలకు విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలను అందజేశారు. ముగింపు వేడుకల్లో ఎస్‌పి మాట్లాడుతూ ఇరు జట్లకు చెందిన అధికారులు చక్కని క్రీడా స్ఫూర్తితో మంచి ప్రతిభను కనబర్చారని, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా సమిష్టిగా పని చేసి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని పోలీసు అధికారులు, సిబ్బందిని కోరారు. విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ భవిష్యత్తులో అధికారులు, సిబ్బందిలో చైతన్యం, స్ఫూర్తిని నింపేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ పద్మనాభ రాజు, విజయనగరం ఇన్చార్జ్ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, సిఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్కేటింగ్' విజేతలకు అభినందన

విజయనగరంటౌన్ : ఈనెల 11 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో జరిగిన 60వ జాతీయస్థాయి ఛాంపియన్ షిప్ పోటీలలో రాష్ట్ర జట్టు తరుపున పాల్గొని పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. మొత్తం ఆరు పతకాలు సాధించిన నేపథ్యంలో శుక్రవారం క్రీడాకారులు డిప్యూటీ స్పీకర్ కోలగట్లను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టలను క్రీడాకారులు చాటి చెప్పారని అన్నారు. క్రీడాకారులకు, క్రీడల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. జిల్లా క్రీడాకారులతో పాటు, కోచ్ లు బద్రి, రాజు, శ్యామ్‌తో పాటు జిల్లా అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి విఎస్ఎస్ మూర్తి తదితరులు ఉన్నారు.

సమస్యలపై వికలాంగుల ధర్నా

విజయనగరంటౌన్ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు కళ్యాణం పైడి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు జనసేన నాయకులు గురాన అయ్యలు, ఆదాడ మోహనరావు మద్దతు తెలిపారు. అయ్యలు మాట్లాడుతూ వికలాంగులకు తొలగించిన పెన్షన్లు తక్షణమే పునరుద్ధరించాలని, ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి, ఎలాగూ ప్రజలకు న్యాయం చేయట్లేదని, సదరం సర్టిఫికెట్ ను ఆధారం చేసుకుని మాత్రమే పింఛన్లు ఇవ్వాలని కోరారు. పద్దెనిమిదేళ్లు పైబడిన వికలాంగులకు ప్రత్యేకమైన వ్యక్తిగత రేషన్ కార్డులను జారీ చేయాలని, వారి కుటుంబీకుల హౌస్ మాపింగ్ వెంటనే తొలగించాలని, వారి కుటుంబాల్లో ఉద్యోగస్తులు లేక నాలుగు చక్రాలు వాహనాలు ఉన్నాయని పెన్షన్లు తొలగించిన వారందరికీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు త్యాడ రామ కృష్ణారావు(బాలు), ఎంటి రాజేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ 40వ వార్షికోత్సవం సందర్భంగా లోకబందు రెసిడెన్సీలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసిద్ధిగాంచిన బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎయిడెడ్ యాజమాన్యంలో ఉన్న రాజా కళాశాలను ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. బొబ్బిలిలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కెజి నుంచి పిజి వరకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, డేవిడ్, శ్రీను, డివైఎఫ్ఐ నాయకులు సురేష్ పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు


రికార్డులను తనిఖీ చేస్తున్న డిసిఒ చంద్రావతి

గురుకులంలో డిసిఒ తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ గురుకులంలో జిల్లా కోఆర్డినేటర్ చంద్రావతి, ఆడిట్ బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పరిశీలించారు. గురుకులంలో లైబ్రరీ, మెస్, కిచెన్ గార్డెన్స్, సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు.. ఇలా అన్ని రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. విద్యార్థులతోపాటు భోజనాలు చేశారు. సిబ్బందితో డిసిఒ చంద్రావతి సమావేశమై, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కనిమెళ్ల విద్యార్థులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కనిమెళ్ల ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటెక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బలగ పాపినాయుడు తెలిపారు. ఇటీవల విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన షాట్‌పుట్ అండర్ -14 బాలికల విభాగంలో డి.రామలక్ష్మి, అండర్ - 17 డిస్కస్‌త్రోలో వై.మౌనిక సత్తాచాటి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్‌ఎంతోపాటు వ్యాయామ ఉపాధ్యాయులు మజ్జి రమేష్, శంకరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు వితరణ

ప్రజాశక్తి-వేపాడ

బల్లంకి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యుటిఎఫ్ విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి విజయకుమారి దంపతులు సామగ్రిని పంపిణీ చేశారు. రూ.10 వేలతో పెన్నులు, ప్లాంకులు, పెన్సిళ్లు, స్టేషనరీ సామగ్రి అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఇమంది జగదీశ్వరరావు, ఎన్.శ్రీరాములు, ఎస్.అప్పారావు పాల్గొన్నారు.

టార్పాలిన్లు పంపిణీ

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో ఎఫ్‌పిజి సభ్యులకు ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు టార్పాలిన్లు, కొడవళ్లు, విత్తనాల కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, ఎంపిడిఒ స్వరూపారాణి, ఎపిఎం విజయలక్ష్మి, ఎఫ్‌పిఒ ఎపిఎం విశ్వేశ్వర రావు, సిసిలు సూరి, నాని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ చంద్రయ్య

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-గుర్ల

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రయ్య సూచించారు. శుక్రవారం వల్లపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గణితంలో గమ్మతులు, సైన్స్‌లో సరదాలపై మేజిక్ షో నిర్వహించారు. మూఢ నమ్మకాలను విడనాడాలన్నారు. రసాయనిక చర్యలపై అవగాహన కల్పించారు. చుక్కలతో కూడికలను చేసి చూపించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా ఉపాధ్యక్షులు మురళి బాబు, మండల నాయకులు దాసరి ఈశ్వరరావు, పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం భ్రమరాంబ పాల్గొన్నారు.

రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని పెరుమాళిలో ఉన్న వీరభద్ర రైస్‌మిల్లును శుక్రవారం ఆర్‌డిఒ శేషశైలజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఆమె ఆరాతీశారు. తగినంత మంది హమాలీలను ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌డిఒ సూచించారు. రైతు భరోసా కేంద్రం నుండి వచ్చిన ధాన్యం వెహికల్ ని సకాలంలో అన్ లోడింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని కస్టోడియన్, రైస్ మిల్లు యజమానిని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరరావు, సిఎస్ డిటి భాస్కరరావు, విఆర్ఒ నాగరాజు, విఎఎ మధు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలుపై ఆరా తీస్తున్న ఆర్‌డిఒ

పిల్లల భవిష్యత్తుపై అవగాహన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పిల్లలు వారి జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పిల్లల భవిష్యత్తు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రతినిధి దుర్గా, ఐసిడిఎస్ సూపర్వైజర్ దేవి, తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి-గరివిడి

చీపురుపల్లి పట్టణానికి చెందిన ఇప్పిలి తవిటిరాజు శస్త్రచికిత్స కోసం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.80 వేల చెక్కును వైసిపి సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం, మండల అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనువాసనాయుడు, పట్టణ అధ్యక్షులు పతివాడ రాజారావు అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు రేవళ్ల సత్తిబాబు, ఎంపిటిసి కోరుకొండ దాలయ్య పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో అంబేద్కర్ చిత్రపటం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి దళితుడి ఇంట్లోనూ అంబేద్కర్ చిత్రపటం ఉండాలని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోగిశ రామ కృష్ణ అన్నారు. శుక్రవారం ఆ సంఘం కార్యాలయంలో జరిగిన కేలెండర్ ఆవిష్కరణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీడి రామకృష్ణ, చీపురుపల్లి నియోజకవర్గ అధ్యక్షులు దమరసింగి ఈశ్వరావు, చీపురపల్లి నియోజకవర్గ కన్వీనర్ దమరసింగి సింహాచలం, దమరసింగి బంగారయ్య, గొండేలశివ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో స్వయం ఉపాధి

ప్రజాశక్తి-డెంకాడ

నాబార్డు ఆధ్వర్యాన శ్రాకో సంస్థ అందిస్తున్న శిక్షణతో స్వయం ఉపాధి లభిస్తుందని నాబార్డు డిడిఎం టి.నాగార్జున తెలిపారు. మండలంలోని అక్కివరంలో శ్రాకో సంస్థ అగరుబత్తి, దూప్‌స్టిక్ తయారీపై ఇస్తున్న శిక్షణను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ఎపిడి కె.సావిత్రి, ఎస్.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

సారా తయారీపై సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-శృంవరపుకోట

గ్రామాల్లో ఎవరైనా నాటు సారా తయారు చేస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్ఇబి ఇన్స్పెక్టర్ ఎస్.ధర్మారావు కోరారు. సారా వల్ల నష్టాలపై మండలంలోని భర్తపురం గ్రామస్తులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారు చేసినా, విక్రయించినా నేరమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈశ్వరరావు, సచివాలయ సెక్రటరీ బంగారు నాయుడు, హెల్త్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర భవిష్యత్తు యువత చేతిలోనే ఉందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టనున్న పాదయాత్ర జయప్రదం కావాలని కోరుతూ శుక్రవారం కోట నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బేబినాయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం చేసిందని విమర్శించారు. ఖాళీ పోస్టులు భర్తీకి ప్రతి ఏడాది నోటిఫికేషన్ జారీ చేస్తామని హామీ ఇచ్చినా అమలు చేయలేదన్నారు. యువ గళం పేరుతో జనవరి 27 నుంచి 400 రోజులు 4వేల కిలోమీటర్లు 100 నియోజకవర్గాలలో చేపట్టనున్న లోకేష్ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కందుకూరు సభలో టిడిపి కార్యకర్తల మృతికి ఈ సందర్భంగా సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు రాంబార్కి శరత్, బి.శ్రీదేవి, స్వప్న, టిడిపి నాయకులు రౌతు రామమూర్తి, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ : వైసిపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను జనాల్లోకి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ నాయకులు కంది చంద్రశేఖర్‌రావు.. పార్టీ శ్రేణులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అక్కివరంలో తన నివాసంలో టిడిపి మండల స్థాయి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 27 నుంచి యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ముందుగా గ్రామంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కందుకూరు సభలో టిడిపి కార్యకర్తల మృతికి సంతాపంగా మౌనం పాటించారు. సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటు అధికార ప్రతినిధి పాణిరాజు పాల్గొన్నారు.


డెంకాడ.. ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

నెల్లిమర్ల : టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి ఆధ్వర్యంలో స్థానిక రామతీర్థం జంక్షన్‌లో అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం టిడిపి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, పార్లమెంట్ స్పోక్స్ పర్సన్ లెంక అప్పల నాయుడు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, టిడిపి పట్టణ అధ్యక్షులు బైరెడ్డి లీలావతి మట్లాడుతూ యువగళం పాదయాత్రను యువత ముందుకు వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పప్పుల చీటీ బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు బైరెడ్డి నాగేశ్వరరావు, యువ నాయకులు అట్టాడ శ్రీధర్, నాయకులు బొంతు రమణ, తాడ్డి సత్యనారాయణ, ముడుమంచి లక్ష్మణ రావు, కౌన్సిలర్ మజ్జి నాగమణి, మహిళా నాయకులు పొడుగు కృష్ణ వేణి, కాళ్ల సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : యుగళగళం పేరుతో టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రను విజయవంతం చేయాలని పట్టణ టిడిపి నాయకులు కోరారు. శుక్రవారం కోట వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల చంద్రబాబు పర్యటన సందర్భంగా కందుకూరులో జరిగిన సంఘటనలో మృతులకు సంతాపం తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ లోకేష్ పాదయాత్రకు జిల్లాలో ఘన స్వాగతం పలికేందుకు విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.


నెల్లిమర్ల.. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న టిడిపి నాయకులు

పూసపాటిరేగ : యువగళం పాదయాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు కోరారు. శుక్రవారం చల్లవానితోటలోని తన నివాసంలో టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరరావు ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా మండల కేంద్రంలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం కందుకూరి సభలో మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో దగా పడ్డ యువతకు అండగా ఉండాలన్న ఉద్దేశంతో చేపడుతున్న పాదయాత్రలో యువత పెద్దఎత్తున పాల్గోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు దంగా భూలోకా, మైలపల్లి సింహాచలం, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాదరావు, టిఎన్‌ఎస్ఎఫ్ అధ్యక్షులు పతివాడ తారక్, నాయకులు పతివాడ తమ్మునాయుడు, పతివాడ అప్పలనాయుడు, ఇజ్జురౌతు ఈశ్వరావు, గోవిందరావు, పిన్నింటి కిశోర్, మహంతి కిశోర్, చందక ఆనందరావు పాల్గొన్నారు.

గజపతినగరం : నారా లోకేష్ చేపట్టే యువగళం పాదయాత్రను ఆశీర్వదించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.ఎ.నాయుడు కోరారు. టిడిపి మండల అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో గజపతినగరంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జగన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని, 43 నెలల కాలంలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని చెప్పారు.

శృంగవరపుకోట : యువగళం పాదయాత్రలో భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవి కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి ముందుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హెూదా తెచ్చి ఉద్యోగాలు ఇస్తానని చెప్పి జనాన్ని మోసం చేసిన జగన్‌ను ప్రశ్నించడానికి నారా లోకేష్ యువగళం కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

గరివిడి : యువగళం పాదయాత్ర విజయవంతం చేయాలని టిడిపి నాయకులు పైల బలరాం, రౌతు కామునాయుడు, వెన్నె సన్యాసినాయుడు, దన్నాన రామచంద్రుడు, తాడ్డే సన్యాసినాయుడు, చనమల మహేశ్వర రావు, సారేపాక సురేష్ బాబు కోరారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ వైసిపి రాక్షస పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో ముల్లు రమణ, మహంతి అప్పలనాయుడు, కెంగువ ధనుంజయ, దన్నాన సూరప నాయుడు, గొర్లె లక్ష్మణరావు, గవిడి నాగరాజు, పిన్నింటి సన్యాసినాయుడు పాల్గొన్నారు.


శృంగవరపుకోట.. మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లలితకుమారి

పేదల సంక్షేమమే లక్ష్యం

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేలు


డెంకాడ.. బుక్‌లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ

ప్రజాశక్తి-బొబ్బిలి

పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బొబ్బిలి పురపాలక సంఘం 4వ సచివాలయం 8వ వార్డులో శుక్రవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఇంటి గోపాలరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జామి : గ్రామాల్లో సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారంపై దృష్టి పెట్టడంతోపాటు సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీయడమే లక్ష్యంగా గడపగడపకు కార్యక్రమం చేపట్టాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని అలమండ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ, దానికి అనుసంధానంగా వాలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకు చేర్చాయన్నారు. ఏ గడప తొక్కినా ముఖ్యమంత్రి పట్ల ప్రజల కృతజ్ఞతాభావం వారి కళ్లల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, జెడ్‌పిటిసి గొర్లె సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్లె రవికుమార్, అలమండ సూరిబాబు రాజు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, సర్పంచ్ కోట పాపమ్మ, వైస్-సర్పంచ్ లగుడు దేముడు, చింతాడ సుబ్రహ్మణ్యం, తాండ్రంకి దశరథ్, కుమరాం రవి, లొట్లపల్లి సూరిదేముడు, జన్నివలస సర్పంచ్ శ్రీరెడ్డి చంద్రునాయుడు, గొడికొమ్ము పిల్లల తాతంనాయుడు, ఎంపిటిసి ఎం.కనకయ్య, రామయ్యపాలెం సత్యం, అన్నంరాజుపేట సూరిబాబు, విజినిగిరి సర్పంచ్ సూర్యారావు పాల్గొన్నారు.


జామి.. గ్రామస్తుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కడుబండి

డెంకాడ : మండలంలోని బంటుపల్లి సచివాలయ పరిధిలోని బంటుపల్లి, గొంపవానిపేట గ్రామాల్లో మూడోరోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులకు వివరించారు. సమస్యలను ఆరాతీశారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి తమ్మినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లపై రాద్ధాంతం తగదు : వైసిపి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పింఛన్లపై ప్రతిపక్ష టిడిపి రాద్ధాంతం చేయడం తగదని వైసిపి మండల అధ్యక్షులు చనమల్ల వెంకట రమణ అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అర్హులైన వారి పేర్లను పరిశీలించి విచారణ చేపట్టాలని నోటీసులు జారీ చేసింది తప్ప రద్దు చేయలేదని చెప్పారు. నూతన సంవత్సరం కానుకగా పింఛను పెంపుదల చేయడం ఇష్టం లేని టిడిపి నాయకులు పింఛన్లు రద్దు చేస్తున్నారని కారుకూతలు కూస్తున్నారని చెప్పారు. టిడిపి నాయకులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. సమావేశంలో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నాయకులు సంచాన శ్రీనివాసరావు, జమ్ము సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కరోనా పట్ల జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

కరోనా పట్ల ప్రతి ఒక్కరు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి ఆర్‌బి రామానాయుడు అన్నారు. శుక్రవారం గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూలులో కరోనాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించి, భౌతిక దూరం పాటించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ నోమాస్క్ నో ఎంట్రీ అనే బోర్డును స్కూల్ గేటు ముందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బిఎల్‌ఒల సమావేశం

ప్రజాశక్తి-వేపాడ

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్‌ఒలతో డిప్యూటీ తహశీల్దార్ సన్యాసి నాయుడు శుక్రవారం సమావేశమయ్యారు. ఓటర్ల జాబితాలో మృతుల పేర్లు తొలగించి, కొత్త పేర్లు నమోదు చేయడం, తదితర అంశాలపై వివరించారు. యాప్‌లో నమోదు చేయాలని విఆర్‌ఒలకు, కార్యదర్శులకు, బిఎల్‌ఒలకు సూచించారు.

పింఛనర్ల సంఘం కార్యాలయంలో లైఫ్ సర్టిఫికెట్ ఆన్‌లైన్

ప్రజాశక్తి-బొబ్బిలి

పింఛనర్ల సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్ల లైఫ్ సర్టిఫికేట్లు ఆన్‌లైన్ చేస్తామని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామమూర్తి తెలిపారు. జనవరి ఒకటి నుంచి 10 వరకు లైఫ్ సర్టిఫికేట్స్ ఆన్‌లైన్ చేస్తామన్నారు. పెన్షనర్లు బ్యాంకు ఖాతా నెంబర్, ఆధార్, ఫోన్, పిపిఒ, సిఎఫ్‌ఎంఎస్ నెంబర్ తో పెన్షనర్ల సంఘం కార్యాలయానికి రావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎల్.జగన్నాధం, కర్రి సత్యనారాయణ, పి.సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.


దర్యాప్తు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొంపల్లి రైతుల ఫిర్యాదుపై దర్యాప్తు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొంపల్లి గ్రామంలో చెరువులు ఆక్రమణకు గురవుతున్నట్లు ఆ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ సిబ్బంది శుక్రవారం దర్యాప్తు చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డిటి సన్యాసినాయుడు, ఎంఆర్ఐ రామలక్ష్మి తెలిపారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని దేవుదల, ఉప్పరనాయుడు వలస, గోపెంపేట తదితర గ్రామాల 70 మంది రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఆర్‌డిఒ అప్పారావు పంపిణీ చేశారు. రాజాంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు మండలాల రైతులకు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ హక్కు పత్రాలతో శాశ్వత హక్కు రైతులకు లభించిందన్నారు. రేగిడి మండలంలో ఇప్పటికే ఏడు గ్రామాల్లో సర్వే పూర్తయిందని ఆర్‌డిఒ తెలిపారు. కార్యక్రమంలో వంగర ఎంపిపి సురేష్ ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపిపిలు వావిలపల్లి జగన్మోహనరావు, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి, భూసర్వే డిటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


భూ హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు

కాంట్రాక్టు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-వంగర

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎంఆర్‌సి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు మాట్లాడుతూ సమగ్ర శిక్ష, కెజిబివిలలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులకు మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు మంజూరు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ఐదు స్పెషల్ లీవ్‌లు మంజూరు చేయాలన్నారు.


నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఉద్యోగులు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ సిఐ సింహాచలం

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జిల్లా పరిషత్ హైస్కూల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సింహాచలం ఆధ్వర్యంలో పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం పరిశీలించారు. ముందుగా వంటశాలలో ఉన్న వస్తువులను పరిశీలించారు. మెనూ ప్రకారం పిల్లలకు అందజేస్తున్నారా? లేదా అని విషయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీదేవి, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


యుటిఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

యుటిఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బొబ్బిలి : యుటిఎఫ్ నూతన క్యాలెండర్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ఆవిష్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని యుటిఎఫ్ నేతలకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు కె.విజయగౌరి, ప్రసన్నకుమార్, రామకృష్ణ, కృష్ణదాసు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

బొబ్బిలి : విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ కోరారు. శ్రీకళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఫేర్ వెల్ ఫంక్షన్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలని కోరారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు కర్రి సత్యనారాయణ, వరప్రసాద్, ప్రిన్సిపాల్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

చింతాడలో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - జామి

మండలంలోని చింతాడలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను శుక్రవారం జెడ్‌పిటిసి గొర్లె సరయు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సరయు మాట్లాడుతూ సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం చొరవతో ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. గ్రామస్తులంతా వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ నేడు వైద్యం ఖరీదైన నేపథ్యంలో గ్రామంలోని పాత సబ్ సెంటర్‌ని అభివృద్ధి చేసి, వెల్‌నెస్ సెంటర్‌గా తీర్చిదిద్దామని తెలిపారు. మండల పరిషత్తు నిధులతో తక్కువ సమయంలోనే నిర్మించామని, అందుకు సహకరించిన ఎంపిపి, ఎంపిటిసి, కాంట్రాక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బావరపు అరుణ, తహశీల్దార్ హేమంత్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ రవికుమార్, జామి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ భాగ్యరేఖ, ఎంపిటిసి నరసింహనాయుడు, ఇఒ పియార్డి లక్ష్మి, వైసిపి నాయకులు అల్లు అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పిటిసి సరయు

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

నూతన సంవత్సర వేడుకల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పట్టణ సిఐ ఎం.నాగేశ్వరరావు హెచ్చరించారు. పోలీసు స్టేషన్లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన, మితి మీరిన వేగంతో వాహనాలు నడిపిన, శబ్ద కాలుష్యం చేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలుగు బృందాలు పర్యటించి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు.

అపశ్రుతులు లేకుండా వేడుకలు : ఎస్ఐ

రామభద్రపురం : నూతన సంవత్సర వేడుకలు ఆనందోత్సాహాలతో అపశ్రుతులు లేకుండా జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలు, బహిరంగ మద్యపానం వంటివి చేస్తూ ప్రజలు భయపడే విధంగా వాహనాలు డ్రైవ్ చేయరాదని హెచ్చరించారు. రహదారులపై ఇష్టానుసారంగా గుంపులు గుంపులుగా తిరుగుతూ అధిక శబ్దాలతో సౌండ్ పొల్యూషన్ చేయరా దన్నారు. రాత్రి 12 గంటల తరువాత సంచారం చేయరాదని తెలిపారు.

ట్యాబ్‌లు పంపిణీ

ప్రజాశక్తి-బాడంగి

స్థానిక కెజిబివిలో విద్యార్థులకు ప్రిన్సిపల్ నజియా ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి బోగి గౌరి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. సాంకేతికంగా విద్యార్థులు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో పిల్లలకు ట్యాబ్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న జెడ్‌పిటిసి రామారావు, ఎంపిపి గౌరి